క్లుప్తంగా

జవాబుదారీతనం కోసమే...



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సమాచార హక్కు చట్టం జిల్లా కార్యవర్గసభ్యుడు సూర్యారావు

జామి: ప్రభుత్వ అధికార యంత్రాంగంలో జవాబుదారీతనం, పారదర్శకత పెంచడానికి సమాచారహక్కు చట్టం వచ్చిందని ఆ చట్టం జిల్లా సమన్వయకమిటీ సభ్యు డు దొడ్డి సూర్యారావు అన్నారు. ఈనెల 12వ తేదీ నాటికి సమాచార హక్కు చట్టం వచ్చి 19ఏళ్ల పూర్తవుతున్న నేపథ్యంలో స్థానిక ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో చట్టం అమలు తీరు, అవగాహన బోర్డులను బుధవారం పరిశీలించారు. చట్టానికి గుండెకాయ వంటి ఫోర్ వన్‌బీ అమలు, పీఐఓ అప్పిలేట్ అథారటీ బోర్డులను కార్యాలయాల్లో పెట్టాలని కోరుతూ ఎంపీడీఓ అప్పలనాయుడు, డీటీ మూర్తికి వినతిపత్రాలు అందజేశారు.

మదుపాడులో వైద్యశిబిరం



శిబిరంలో వైద్యసేవలందిస్తున్న డాక్టర్ అనూజ్‌రాయ్

గజపతినగరం: మండలంలోని మదుపాడ గ్రామంలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి అనూజ్‌రాయ్ ఆధ్వర్యంలో బుధవారం 104 వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్యాధికారి, సిబ్బంది గ్రామానికి చెందిన ఏడుగురు గర్భిణులతో పాటు 54 మందికి వివిధ వైద్యపరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు 249 దరఖాస్తులు

- ఈనెల11 వరకు గడువు పొడిగింపు
- 14న జిల్లా కేంద్రంలో లాటరీ: ఎక్సైజ్ సీఐ చక్రవర్తి



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ చక్రవర్తి

చీపురుపల్లి: చీపురుపల్లి ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం పరిధిలోని చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం మండలాల్లో మద్యం దుకాణాల కోసం ఇంత వరకు 249 దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ సీఐ సీహెచ్ చక్రవర్తి చెప్పారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తొలుత వచ్చిన ఆదేశాల ప్రకారం ఈనెల 9 వరకు దరఖాస్తులు స్వీకరణ గడువుకాగా, ఈనెల11 వరకు ప్రభుత్వం గడువు పొడిగించిదని తెలిపారు. చీపురుపల్లి మండలంలో 7 మద్యం దుకాణాలకు 142 దరఖాస్తులు, గరివిడి మండలంలో 5 దుకాణాలకు 68 దరఖాస్తులు, మెరకముడిదాంలో 4 దుకాణాలకు 79 దరఖాస్తులు వచ్చాయని వివరించారు. ఇంతవరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ కలిపి మొత్తం 249 దరఖాస్తులు వచ్చాయని, 11 వరకు గడువు ఉన్నందున ఔత్సాహికులు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. జిల్లా కేంద్రంలోని సుజాత కన్వెన్షన్ ప్రాంగణంలో ఈనెల 14న దుకాణాల కేటాయింపునకు లాటరీ తీయనున్నట్లు తెలిపారు.

రోడ్డు వేయాలని గిరిజనుల ఆందోళన



మారికలో గిరిజనులతో కలిసి ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

వేపాడ: మండలంలోని గిరిశిఖర మారిక గ్రామానికి రోడ్డు వేయాలని ఏపీ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ ప్రభుత్వా న్ని కోరారు.ఆగ్రామంలో గిరిజనులతో కలిసి సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు, అధికారులు మారుతున్నా మారిక గ్రామ గిరిజనుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. 20 రోజుల్లో గ్రామానికి రోడ్డు వేయకపోతే ఎంపీడీఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని చెప్పారు. గ్రామానికి రోడ్డు వేసేందుకు గతంలో నాలుగు కిలోమీటర్ల మేర జంగిల్ క్లియరెన్స్ చేశారని, తర్వాత రోడ్డు నిర్మాణానికి అనుమతులు లేవంటూ కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారన్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు పనులు చేయించాలని కోరారు. సీపీఎం నాయకులు జి.అప్పారా వు, గమ్మెల బాబురావు, అప్పలనాయుడు, ఆశు, అర్జున్, ఆనంద్, వెంకటరావు, శ్రీను కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తూర్పుకాపులకు టికెట్ కేటాయించాలి

చీపురుపల్లి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయ సంఘాలు తూర్పుకాపులకు టికెట్ కేటాయించాలని కోరుతూ రాష్ట్ర తూర్పు కాపు సంఘం కార్యదర్శి మంత్రి రమణమూర్తి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మరికొద్ది రోజుల్లో జరగనున్న టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉత్తరాంధ్రలో అత్యధిక సంఖ్యాబలం కలిగిన తూర్పుకాపు సామాజిక వర్గానికి ఆ టికెట్ కేటాయించాలని కోరారు.

ఈరోడ్డులో ప్రయాణం... నరకమే

- అరకు– విశాఖ రోడ్డులో ఎక్కడికక్కడే గుంతలు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- గత ప్రభుత్వంలో ఈ రోడ్డులో కొంతమేర జరిగిన మరమ్మతులు
- కూటమి ప్రభుత్వం వచ్చాక మరమ్మతుల ఊసే లేదు



గోల్డ్ స్టార్ జంక్షన్ సమీపంలో అరకు- విశాఖ రోడ్డుపై ఏర్పడిన గుంతలు



ఎల్.కోట జంక్షన్‌లో రోడ్డుపై గోతుల్లో నిలిచిన వర్షం నీరు



గోల్డ్ స్టార్ జంక్షన్ వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంత వద్ద హెచ్చరికగా ఎర్రజెండా పాతిన స్థానికులు రోడ్డు

లక్కవరపుకోట: నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే మండల పరిధిలోని అరకు -విశాఖ జాతీయ రహదారిలో ప్రయాణం వాహన చోదకులకు, ప్రయాణికులకు నరకప్రాయంగా మారింది. ఈమార్గంలో స్టీల్ ఎక్సేంజ్, మ మహామాయ కర్మాగారాలకు చెందిన భారీ వాహనాలు పరిమి తికి మించి లోడ్‌లతో ప్రయాణిస్తుండడంతో ఎక్కడికక్కడే గుంతలు తేలడంతో రోడ్డు అధ్వానంగా తయారైంది. దీనికితోడు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గుంతలు మరింత పెరిగాయి. మండలంలోని గోల్డ్‌స్టార్ జంక్షన్, సంతపేట, సోంపురం,ఎల్.కోట జంక్షన్‌లలో పరిస్థితి దారుణంగా ఉంది. గోతుల వల్ల తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఏ మాత్రం వర్షం కురిసినా రోడ్డు మధ్యలో ఉన్న గుంతలు నీటితో నిండిపోయి చెరువులను తలపిస్తున్నాయి.గోల్డ్ స్టార్ జంక్షన్ వద్ద ఇటీవల కురిసిన వర్షాలకు ఏర్పడిన పెద్ద గొయ్యిని ప్రయాణికులు గుర్తించేలా స్థానికులు అక్కడ క్రేటర్, ఇసుక బస్తాను అడ్డుగా పెట్టి కర్రకు ఎర్రటి వస్త్రం చుట్టి పాతారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కొత్తవలస మండల కేంద్రం నుంచి ఎల్.కోట మండ లంలోని గోల్డ్‌స్టార్ జంక్షన్ వరకు మరమ్మతులు జరిగాయి. ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో మిగతా రోడ్డు పనులు నిలిచిపోయాయి. కొత్తవలస నుంచి ఎల్.కోటలోని గోల్డ్ స్టార్ జంక్షన్ వరకు కొంతమేర ప్రయాణం సాఫీగా సాగుతున్నా, మిగతా రోడ్డులో ప్రయా ణమంటేనే వాహన చోదకులు హడలిపోతున్నారు.కూటమి ప్రభుత్వం వచ్చాక రోడ్డు మరమ్మతుల ఊసే ఎత్తకపోవడంతో ప్రయాణికులకు కష్టాలు తప్పడం లేదు. ఈరోడ్డులో అరకు అందాలను తిలకించేందకు నిత్యం వందలాది మంది పర్యాటకులు ద్విచక్ర వాహనాలు, టూరిస్టు బస్సుల్లో ప్రయాణిస్తుంటారు. సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

ప్రజావసరాలు గుర్తించి పనులు చేయండి

- ఉద్యోగులు రాజకీయాలు చేయకుండా సక్రమంగా విధులు నిర్వర్తించాలి
- అధికారుల తీరుపై సర్వసభ్యసమావేశంలో మండిపడిన ప్రజాప్రతినిధులు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సోమేశ్వరరావు

శృంగవరపుకోట: ప్రజావసరాలు గుర్తించి, అందుకు తగ్గట్టుగా పనులు చేయాలని, ప్రోటోకాల్ మరిచిపోయి, రాజకీయాలు చేయకుండా మీ ఉద్యోగం సక్రమంగా చేయండం టూ ఎంపీపీ సొండి సోమేశ్వర రావు, వైస్ ఎంపీపీ సుబ్బలక్ష్మి అధికారులను హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సతీ ష్ నేతృత్వంలో ఎంపీపీ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా శాఖల వారీగా సమీక్షించారు. ఉపాధి హామీ పథకం పనుల గురించి ఆ పథకం ఏపీఓ సురేష్‌కుమార్ వివరిస్తుండగా ఎంపీపీ స్పందిస్తూ మీకు నచ్చినట్టు పనులు ప్రతిపాదించి చేసుకుంటే ప్రజా ప్రతినిధులుగా తామెందుకని, మండలంలో 80 శాతానికి పైగా ఉపాధి పనులు చేసిన గ్రామం ఒక్కటి కూడా లేదని, ఇదేనా మా పనితీరంటూ మండిపడ్డారు. గత సమావేశపు మినిట్స్ చదివి ఎన్ని పరిష్కరించారో చెప్పండని వైస్ ఎంపీపీ సుబ్బలక్ష్మి ఆదేశించగా, ఎంపీడీఓ కార్యాలయ ఉద్యోగులు గత సమావేశపు మినిట్స్ నోట్ చేయలేదంటూ నీళ్ల నమిలారు. దీంతో ఆమె స్పందిస్తూ సమస్యలు పరిష్కరించని మొక్కుబడి సమావేశాలు ఎందుకని ఉద్యోగులపై మండిపడ్డారు.వసి గ్రామ వీఓఏను ఎలా తొలగించారు..? ఇప్పుడు ఒకే గ్రామానికి ఇద్దరు వీఓఏలు ఎందుకున్నారు,ఎవరికి జీతం ఇస్తారు, మూడు నెలలుగా ఎన్ని ఫిర్యాదులు ఇచ్చినా ఎందుకు పరిష్కరించలేదని వెలుగు ఏపీఓ వై.ర మణను ఎంపీపీతో పాటు వైస్ ఎంపీ పీ సుబ్బలక్ష్మి నిలదీశారు. కృష్ణాపురం సర్పంచ్ యామినీదేవి, జెడ్పీటీసీ ఎం.వెంకటలక్ష్మి మాట్లాడుతూ తమ గ్రామాల్లో ఏ ఫిర్యాదులు లేకుండా వీఓఏలను ఎందుకు తొల గించారో చెప్పాలంటూ నిలదీశారు. ఏపీఓ బదులిస్తూ తాను కొత్తగా వచ్చానని అధికారులతో సంప్రదించి నెల రోజుల్లో చర్యలు తీసుకుంటానని చెప్పారు.

ఆక్రమణలపై చర్యలేవి..?

ముషిడిపల్లిలో 11 సెంట్ల ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురైనట్లు గుర్తించినా, జిందాల్ భూముల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా, రోడ్లు వేస్తున్నా ఎందుకు చర్యలు తీసుకోలేదని తహసీల్దార్ అరుణకుమారిని వైస్ ఎంపీపీ నిలదీశారు. కోర్టు స్టే ఉందని తహసీల్దార్ చెప్పడంతో ప్రభుత్వ స్థలం కబ్జాలు చేసి, స్టేలు తెచ్చుకునే అవకాశం మీరే ఇస్తారుగా అంటూ మండిపడ్డారు. పల్లెపండగలో భాగంగా మంజూరైన పనులు చేసేందుకు ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇవ్వాలని తహసీల్దార్‌ను ఎంపీపీ కోరగా...ఇసుక తవ్వకాలకు అనుమతులిచ్చే అధికారం తనది కాదని, అక్రమ రవాణా, అమ్మకాలు జరిగితే మండల కమిటీతో కలిసి అడ్డుకుని కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ సమాధానమిచ్చారు. ఆలుగుబిల్లి ఎంపీటీసీ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇసుకతవ్వకాలకు అనుమతి ఇస్తే అన్ని పంచాయతీలకు ఇవ్వాలని, లేదంటే ఎవరికీ ఇవ్వవద్దని, ఒక్కో ఊరికి ఒక్కో న్యాయం కుదరదన్నారు. పీఆర్ జేఈ సత్యనారాయణ పంచాయతీ పనులపై వివరణ ఇచ్చే క్రమంలో తాము ప్రతిపాదించిన పనులు ఏమీ మంజూరు చేయలేదని, తాము చేసిన ప్రతిపాదనలు ఎందుకు మారాయి అంటూ ఎంపీపీ , వైస్ ఎంపీపీతో పాటు ఎస్.కోట సర్పంచ్ సంతోషికుమారి తదితరులు ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశానికి ఆలస్యంగా వచ్చిన కొట్టాం వైద్యాధికారి శిరీషను వెళ్లిపోవాలంటూ ఎంపీపీ మండిపడ్డారు. కొన్ని శాఖల అధికారులు పూర్తిగా డుమ్మా కొట్టారు.

మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ



సావిత్రీబాయి పూలే విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు, నాయకులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని చుక్కవలస ప్రాథమికోన్నత పాఠశాలలో ఆ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు రాజశేఖర్ తన బంధువుల సహకారంతో డాక్టర్ అబ్దుల్ కలాం, జవహర్‌లాల్ నెహ్రూ, సావిత్రీబాయిపూలే, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఈవిగ్రహాలను ఎంఈఓ పి.రామారావు,స్థానిక నాయకులు అన్నంనాయుడు, బోడినాయుడు, కె.వెంకటరమణ, ఎస్.జగన్నాథం బుధవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల్లో మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయటం మంచి ఆలోచనని అన్నారు. విగ్రహాల ఏర్పాటుకు సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు ఒంపల్లిలో ఆధార్ శిబిరం

బొండపల్లి: జాతీయ పోస్టల్ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని ఒంపల్లి ఉన్నత పాఠశాల ఆవరణంలో పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఆధార్ ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్లు గజపతినగరం పోస్టల్ సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ బొద్దుల ఉపేంద్ర బుధవారం తెలిపారు. శిబిరంలో కొత్తగా ఆధార్ కార్డు నమోదు చేసుకునే అవకాశంతో పాటు, కార్డుల్లో మార్పులు,చేర్పులు చేయడం,ఆధార్ నంబర్‌కు ఫోన్ నంబర్లను లింక్ చేయడం వంటి సేవలను ఉచితంగా పొందవచ్చని చెప్పారు. అలాగే పోస్టల్ ఇన్స్యూరెన్స్‌తో పాటు సేవింగ్స్‌కు సంబంధించిన సేవలు శిబిరంలో అందిస్తామని, మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

వేపాడ: మండలంలోని బానాది పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి ఏ.ఎస్.ఎస్.ఎన్.మూర్తి సక్రమంగా విధులు నిర్వర్తించడం లేదని ఆ పంచాయతీ సర్పంచ్ కర్రి యశోద ఎంపీడీఓ సూర్యనారాయణకు బుధవారం ఫిర్యా దు చేశారు. ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి నిర్వాహకం వల్ల పంచాయతీలో పారిశుద్ధ్యం లోపించిందని, 90రోజులు గడుస్తున్న పంచాయతీ సమావేశం నిర్వహించలేదని ఎంపీడీఓకు సర్పంచ్ వివరించారు. తాను సమావేశం ఏర్పాటు చేయాలని చెప్పినా స్పందించ డం లేదని వాపోయారు. సర్పంచ్ పరిశీలించాల్సిన రికార్డులు కూడా ఇవ్వడం లేదని, గ్రామసచివాలయంలో ప్రింటర్ పాడై నెల రోజులవుతున్నా పట్టించుకోలే దని తెలిపారు. ఈనెల 2న గ్రామసభ నిర్వహించకుండా 4వ తేదీన తనకు కాని, వార్డుమెంబర్లకు కానీ సమాచారం ఇవ్వకుండా సచివాలయంలో కాకుండా రామాలయం వద్ద నిర్వహించారని సర్పంచ్ చెప్పారు. సర్పంచ్, వార్డు సభ్యులకు సమాచారం ఇవ్వకుండా గ్రామ సభ నిర్వహించడమంటే పాలకవర్గాన్ని అవమానించడంగా భావిస్తున్నామన్నా రు. నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం నుంచి సచివాలయాన్ని వేరే భవనంలోకి మార్చేందుకు పంచాయతీ కార్యదర్శి ప్రయత్నం చేస్తున్నారని, పంచాయతీ తీర్మానం లేకుండా ఎలా మార్పు చేస్తారని పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నిస్తే స్పందించలేదన్నారు. ప్రభుత్వ నిధులతో నిర్మించిన పక్కా భవనంలోనే సచివాలయ సిబ్బంది విధులు నిర్వర్తించేలా చూడాలని వినతిపత్రం అందజేశారు. పంచాయతీ కార్యదర్శిపై సమగ్ర విచారణ చేయాలని మండల పంచాయతీ విస్తరణాధికారి రవికుమార్‌ను ఆదేశిస్తామని ఎంపీడీఓ సర్పంచ్‌కు తెలిపారు.

ఏదయా మీ దయ మా మీద లేదా..



వంగపల్లిపేటలో బాణాలతో దసరా పద్యాలు పాడుతున్న విద్యార్థులు



జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష నివాసం వద్ద బాణాలతో సందడి చేస్తున్న పోలీస్‌లైన్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు

చీపురుపల్లి: దాదాపు రెండు దశాబ్దాల క్రితం దసరా వచ్చిందంటే పిల్లలు బాణాలు పట్టుకుని, తంగుడు పత్రితో ఉన్న బ్యాగును భుజాన వేసుకుని వీధుల్లో ప్రతీ ఇంటికి వెళ్లి దసరా పద్యాలు పాడుతూ బాణాలతో తంగుడు పత్రిని జల్లేవారు. ఏదయా మీ దయ మా మీద లేదా...ఇంతసేపు ఉంచుటా ఇది మీకు తగునా..దసరాకు వస్తిమని విసవి సలు పడకు అంటూ పద్యాలు పాడుతుంటే ఎంతో సందడిగా ఉండేది. ప్రస్తుత తరం పిల్లల్లో చాలామందికి ఆ దసరా బాణాల పండగ తెలియదు. అందుకే నేటి తరం పిల్లలకుబాణాల పండగ విశిష్టత తెలియజేస్తూ పట్టణంలోని వంగపల్లిపేట, పోలీస్‌లైన్ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు బాణాల పండగను బుధవారం నిర్వహించారు. వంగపల్లిపేట, పోలీస్‌లైన్ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు బాణలు పట్టుకుని ఇంటింటికీ వెళ్లి దసరా పద్యాలు పాడుతూ సందడి చేశారు.

సరస్వతీ నమస్తుభ్యం



బొండపల్లి: దేవుపల్లిలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో పూజల్లో పాల్గొన్న విద్యార్థులు



చీపురుపల్లి: సరస్వతీదేవిగా దర్శనమిచ్చిన చీపురుపల్లిలోని కనకమహాలక్ష్మి అమ్మవారు



జామి: అలమండ కనకదుర్గ ఆలయంలో సరస్వతీ దేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు



చీపురుపల్లి: విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేస్తున్న కనకమహాలక్ష్మి దేవస్థానం ఈఓ, కమిటీ ప్రతినిధులు



చీపురుపల్లి: చీపురుపల్లి కనకమహాలక్ష్మి ఆలయంలో పూజలు చేస్తున్న విద్యార్థులు, మహిళలు



చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి బి.పి.కాలనీలో సరస్వతీదేవి పూజ చేస్తున్న విద్యార్థులు

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు బుధవారం చీపురుపల్లి కనకమహాలక్ష్మి ఆలయం, బొండపల్లి మండలం దేవుపల్లిలోని రాజరాజేశ్వరీదేవి ఆలయం, జామి మండలంలోని అలమండ కనకదుర్గ ఆలయంలో, పలుగ్రామాల్లోని దేవీ మండపాల్లో అమ్మవారు చదువుల తల్లి సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి ని దర్శించుకునేందుకు ఆలయాలు, మండపాలకు భక్తులు పోటెత్తారు. చీపురుపల్లి కనకమహాలక్ష్మి ఆలయంలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించా రు. విద్యార్థులతో సరస్వతీదేవి పూజ చేయించి, వారికి పుస్తకాలు,పెన్నులను దేవస్థానం ఈఓ బి.శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్ అందజేశారు.గరివిడి మండల కేంద్రంలోని బి.పి.కాలనీలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపంలో విద్యార్థులతో అర్చకులు సరస్వతీదేవి పూజ చేయించారు.

– చీపురుపల్లి/బొండపల్లి/జామి/చీపురుపల్లిరూరల్(గరివిడి)

గర్భిణులకు వైద్యపరీక్షలు



గర్భిణులకు భోజనం వడ్డిస్తున్న వైద్యాధికారి సామ్రాజ్యలక్ష్మి

జామి: ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమంలోభాగంగాస్థానిక పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్యాధికారి సామ్రాజ్యలక్ష్మి బుధవారం వైద్యపరీక్షలు చేశారు.గర్భిణులకు ఆరోగ్య జాగ్రత్తలు, పౌష్టికాహారం గురించి వివరించి, ఉచితంగా మందులు అందజేశారు. మండల కేంద్రానికి చెందిన వడాల గురువులు పుట్టినరోజు సందర్భంగా ఆయన కుమార్తె హిమజ గర్భిణులకు వారితో ఆస్పత్రికి వచ్చిన సహాయకులకు భోజనాలు ఏర్పాటు చేశారు.

వేపాడ పీహెచ్‌సీలో..

వేపాడ: స్థానిక పీహెచ్‌సీలో 38 మంది గర్భిణులకు వైద్యాధికారి ధర ణి బుధవారం వైద్యపరీక్షలు చేశారు.హైరిస్క్ గర్భిణులను గుర్తించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించి, మందులు అందజేశారు. గర్భిణులు, వారి సహాయకులకు బానాది శ్రీ సత్యసాయిసేవా సమితి సభ్యులు భోజన సదుపాయం కల్పించారు.

బాధ్యతల స్వీకరణ



ఈఓపీఆర్డీ ఉమ

జామి: మండల ఈఓపీఆర్డీగా బి.ఉమ బుధవా రం బాధ్యతలు స్వీకరించారు. ఈమె వేపాడ మండలం నుంచి బదిలీపై ఇ క్కడికి వచ్చారు. ఇదివర కు ఇక్కడ ఈఓపీఆర్డీగా ప నిచేసిన శ్రీదేవి కొత్తవలస మండలానికి బదిలీపై వెళ్లారు.

ఐసీడీఎస్ పీఓగా రాజేశ్వరి

చీపురుపల్లి: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిగా ఎం.రాజేశ్వరి బుధవారం బాధ్యతలు స్వీకరించా రు. ఈమె అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పెదబయిలి ప్రాజెక్టు నుంచి బదిలీపై చీపురుపల్లికి వచ్చారు. ఇది వరకు ఇక్కడ పీఓగా విధులు నిర్వర్తించిన కె.రాజేశ్వరి కొద్ది నెలల క్రితమే ఉద్యోగ విరమణ పొందారు.

వెలుగు ఏపీఎంగా ధనలక్ష్మి



మెరకముడిదాం: ఏపీఎం ధనలక్ష్మికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న వెలుగు సిబ్బంది, వీఓఏలు

మెరకముడిదాం: మండల వెలుగు ఏపీఎంగా వై.ధనలక్ష్మి స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన కె.ఉమామహేశ్వరరావు గుర్ల మండలానికి బదిలీ అయ్యారు.

వేపాడ తహసీల్దార్‌గా రాములమ్మ



రాములమ్మ

వేపాడ: మండల తహసీ ల్దార్‌గా రాములమ్మ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె మెంటా డ మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. తహసీల్దార్‌కు రెవెన్యూ కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన



బొండపల్లి: గరుడుబిల్లిలో రైతులకు సేంద్రియ ఎరువు తయారీపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ మహారాజన్,వ్యవసాయ సిబ్బంది

బొండపల్లి: అన్ని రకాల పంటల సాగులో సేంద్రియ ఎరువులను వినియోగించాలని గజపతినగరం సబ్ డివిజన్ ఏడీఏ కె.మహారాజన్ రైతులకు సూచించారు. మండలంలోని గరుడుబిల్లి,ఒంపల్లి గ్రామాల్లో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. రైతులకు సేంద్రియ వ్యవసాయం, సేంద్రియ ఎరువుల తయారీపై అవగాహన కల్పించారు.వ్యవసాయ శాస్త్రవేత్తలు, సిబ్బంది సూచనలను పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని చెప్పారు. విజయనగరం గాజులరేగ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త ఎం.శ్రీనివాస్, ఏఓ పి.వి.మల్లికార్జునరావు, టెక్నికల్ ఏఓ లోకేష్, గరుడుబిల్లి సర్పంచ్ బొద్దల కృష్ణవేణి, ఏఈఓ సంతోష్ కుమార్, వీఏఏ అప్పలనాయుడు పాల్గొన్నా రు.

సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలి

జామి: వరి పంటను ప్రస్తుతం పాముపొడ, దోమపోటు తెగుళ్లు ఎక్కువగా ఆశిస్తున్నాయని, రైతులు సకాలంలో గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని ఏడీఏ ఎల్.విజయ సూచించారు.మండల కేంద్రం జామిలో ఏఓ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. తెగుళ్ల నివారణకు పిచికారీ చేయాల్సిన మందులను రైతులకు సిఫార్సు చేశారు. మాజీ జెడ్పీటీసీ పెదబాబు, వీఏఏలు పాల్గొన్నారు.

పెంటశ్రీరాంపురంలో

గంట్యాడ: పెంటశ్రీరాంపురంలో ఏఓ బి.శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. సాంబ మసూరి రకం ప్రస్తుతం పొట్టదశలో ఉందని, ఈదశలో అగ్గితెగులు సోకే అవకాశం ఉందని, నివారణ చర్యలు చేపట్టాలని రైతులకు ఏఓ వివరించారు. ఉప సర్పంచ్ కరక మహేష్, బోశం ఎర్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములుకండి



దత్తిరాజేరు: గాంధీ చిత్రపటం వద్ద నివాళి అర్పించి శిక్షణ ప్రారంభిస్తున్న ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రాజేశ్వరి



బొండపల్లి: మాట్లాడుతున్న ఎంపీపీ చలం నాయుడు



గుర్ల: మాట్లాడుతున్న ఎంపీపీ ప్రమీల

గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు మెంబర్లు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీడీఓలు సూచించా రు. 2024– 25 ఆర్థికసంవత్సరానికి సంబంధించి ఆర్‌జీఎస్‌ఏ కార్యాచరణ ప్రణాళికలపై మెరకముడిదాం , దత్తిరాజేరు, బొండపల్లి, గుర్ల, వేపాడ, గజపతినగరం మండల పరిషత్ కార్యాలయాల్లో ఎంపీడీఓల ఆధ్వర్యంలో ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు బుధవారం శిక్షణ ఇచ్చారు. పంచాయతీ సమావేశాలు, పారిశుద్ధ్యం, ఘనవ్యర్థాల నిర్వహణ, పంచాయతీరాజ్ చట్టాలు,వీధి దీపాల ఏర్పా టు, తాగునీటిసరఫరా, పంచాయతీల ఆస్తుల పరి రక్షణ, పంచాయతీ సమావేశాలు, తదితర అంశాల పై అవగాహన కల్పించారు. దత్తిరాజేరు, బొండపల్లి, గుర్ల ఎంపీపీలు గేదెల సింహాద్రి అప్పలనాయుడు, చల్లా చలంనాయుడు, పొట్నూరు ప్రమీల, దత్తిరాజేరు, గుర్ల, వేపాడ, గజపతినగరం జెడ్పీటీసీలు రౌతు రాజేశ్వరి, శీర అప్పలనాయుడు, ఎస్.అప్పారావు, గార తవుడు, వేపాడ వైస్ ఎంపీపీ అడ పా ఈశ్వరరావు, ఆయా మండలాల ఈఓపీఆర్డీలు పాల్గొన్నారు.

– మెరకముడిదాం/దత్తిరాజేరు/గుర్ల/వేపాడ/గజపతినగరం